క్లుప్తంగా

ఉద్యోగ విరమణ సహజం

నడిగూడెం : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని పలువురు వక్తలు అన్నారు. నడిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ పొందిన దుర్గాప్రసాద్‌కు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్, ఉపాధి హామీ పథకం ఇంటిలిజెన్స్ అధికారి ఎర్ర లింగారెడ్డి, ఎంపీఓ విజయకుమారి, ఏపీఎం రామలక్ష్మి, మాజీ సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, మాజీ ఎంపీటీసీ గుండు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో నారాయణపురం విద్యార్థికి గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న రషీద్

చిలుకూరు : నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో సుమన్ చోటో ఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 22వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో చిలుకూరు మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన షేక్ మీరా కుమారుడు షేక్ రషీద్ ఆల్ కలర్స్ బెల్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం రషీద్‌ను గ్రామస్తులు అభినందించారు. కరాటే మాస్టర్ సైదులు వద్ద కరాటేలో శిక్షణ పొందుతున్నట్లు రషీద్ తెలిపాడు.

నేరేడుచర్ల వాసవీ క్లబ్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న నేరేడుచర్ల వాసవీ, వనితా క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల వాసవీ, వనితా క్లబ్‌లు ఉత్తమ సేవలందించినందుకు గాను రీజియన్ స్థాయిలో ఉత్తమ క్లబ్ అవార్డు లభించినట్లు వాసవీ క్లబ్ వైస్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, జోన్ చైర్ పర్సన్ వీరవల్లి శ్రీలత తెలిపారు. సోమవారం స్థానికంగా వారు విలేకరులతో మాట్లాడారు. మిర్యాలగూడలో ఆదివారం జరిగిన వీరవల్లి రీకాన్ మహోత్సంలో అవార్డు క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధి రవ్వ గీత, అబ్జర్వర్ వెంకటి శబరినాథ్, పీఆర్వో రాయపూడి భవానీ, ఆర్‌సీ వీరవెల్లి పద్మావతిల చేతుల మీదుగా వాసవీ, వనితా క్లబ్ అధ్యక్షుడు గెల్లి లక్ష్మీనర్సింహారావు, లక్ష్మీప్రసన్న, కార్యదర్శులు జూలూరు అశోక్, చెరుకు కవిత, కోశాధికారి తాళ్లూరి శ్రీనివాస్, గరిణే జ్యోతిలు అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో రీజియన్ మాజీ చైర్మన్ కందిబండ శ్రీనివాస్‌రావు, నటరాజ్, గోపాలకృష్ణ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఆర్మీ జవాన్ లింగరాజుయాదవ్

మునగాల : మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన పగిళ్ల మహేశ్వరి ఇటీవల అనారోగ్యానికి గురై మరణించింది. మహేశ్వరి తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందడంతో ఆమె తన తమ్ముడు సాయిభార్గవ్‌తో కలిసి వృద్ధురాలైన నాయనమ్మ వద్ద ఉండేది. మహేశ్వరి మృతితో సాయిభార్గవ్ జీవనం అగమ్యగోచరంగా మారింది. దీంతో సోమవారం గణపవరం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ అమరబోయిన లింగరాజుయాదవ్ సాయిభార్గవ్‌ను పరామర్శించి రూ.ఐదువేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్, పచ్చిపాల రామకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఎర్త్ క్లబ్ కమిటీలు ఎన్నిక

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ ఎర్త్ క్లబ్ – యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ బృందం ఆధ్వర్యంలో స్కూల్ ఎర్త్ క్లబ్ కమిటీలను ఎన్నుకున్నారు. 6 నుంచి 9వ తరగతి వరకు తరగతికి ఇద్దరి చొప్పున స్కూల్ ఎర్త్ క్లబ్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, పీఈటీ ఉస్మాన్, నగేష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లోని బాలికల పాఠశాలలో..

హుజూర్‌నగర్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ ఎర్త్ క్లబ్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియమితులైన వారికి బ్యాడ్జీలు ధరింపజేసి అభినందించారు. పాఠశాల ఆవరణలో ఉన్న మహావృక్షాన్ని తల్లి వృక్షంగా నామకరణం చేసి పూజించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌ఎం అబ్దుల్ లతీఫ్‌ను ఎంఈఓలు సైదానాయక్, ఛత్రునాయక్, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, వెంకటరెడ్డి, అనుదీప్, రిటైర్డ్ ఎంఈఓలు, విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూపు మారనున్న గ్రామీణ రోడ్లు

- రూ.61 కోట్ల నిధులు మంజూరు
- టెండర్ల ప్రక్రియ పూర్తి
- త్వరలో పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కంకర తేలిన రత్నవరం- ఆకుపాముల రోడ్డు

నడిగూడెం : మండలంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టింది. మండలం కేంద్రం నుంచి పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అనేక ఏళ్లుగా అధ్వానంగా ఉండడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వం డబుల్ రోడ్ల నిర్మాణానికి రూ.61 కోట్లు నిధులు మంజూరు చేసింది. నడిగూడెం మండల కేంద్రం నుంచి నారాయణపురం క్రాస్ రోడ్డు, కరివిరాల క్రాస్ రోడ్డు, కాగిత రామచంద్రాపురం మీదుగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మండడి నర్సయ్యగూడెం మీదుగా నాయకన్‌గూడెం క్రాస్ రోడ్డు వరకు 9.5 కిలోమీటర్లకు రూ. 20 కోట్లు, నడిగూడెం నుంచి చాకిరాల, రత్నవరం, అనంతగిరి మండలం వాయిలసింగారం, వసంతాపురం, కొత్తగోల్‌తండాల మీదుగా అమీనాబాద్ వరకు 12.2 కిలోమీటర్లకు రూ.25 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే టెండర్ ప్రక్రియను కూడా అధికారులు పూర్తి చేశారు. అదేవిధంగా నడిగూడెం మండలం రత్నవరం నుంచి తెల్లబెల్లి, మునగాల మండలం కోదండరామాపురం మీదుగా ఆకుపాముల వరకు 7.5 కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులకు త్వరలో టెండరు ప్రక్రియ పూర్తి కానున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, డబుల్ రోడ్ల మంజూరుతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు..

రత్నవరం నుంచి చాకిరాలకు వెళ్లే రోడ్డుపై కల్వర్టు అధ్వానంగా మారింది. వాహనాలు రద్దీ పెరుగుతుండడంతో పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ కల్వర్టు నిర్మాణానికి రోడ్లు, భవనాల శాఖ అధికారులు మూడు కోట్ల రూపాయల ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు కాగానే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు.

తొలగనున్న ఇక్కట్లు



నడిగూడెం నుంచి కాగిత రామచంద్రాపురం మీదుగా నాయకన్‌గూడెం క్రాస్ రోడ్డు వరకు డబుల్ రోడ్డు మంజూరు అవుతుందని ఏనాడు అనుకోలేదు. ప్రభుత్వం మా గ్రామం మీదుగా డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేయడం పట్ల ఆనందంగా ఉన్నది. రోడ్డు నిర్మాణంతో ఇక్కట్లు తొలగుతాయి.

– ముదిరెడ్డి వెంకటరెడ్డి,కాగితరామచంద్రాపురం

ఆనందంగా ఉంది



నడిగూడెం నుండి మా గ్రామం మీదుగా అమీనాబాద్ వరకు డబుల్ రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు కావడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం రోడ్లు ఇరుకుగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. త్వరితగతిన పనులు ప్రారంభించి పూర్తి చేయాలి.

– మిట్టగపుల సందీప్, చాకిరాల

త్వరలో పనులు ప్రారంభం

నడిగూడెం నుంచి కాగితరామచంద్రాపురం మీదుగా ఖమ్మం జిల్లాకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.20 కోట్లు, నడిగూడెం నుంచి అమీనాబాద్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పూర్తయ్యాయి. త్వరలో పనులు ప్రారంభం అవుతాయి. రత్నవరం నుంచి ఆకుపాముల వరకు డుబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరయ్యాయి. కానీ టెండర్ పూర్తి కాలేదు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పనులు చేపడతాం.

– సత్యనారాయణ, ఏఈ, రోడ్లు, భవనాల శాఖ

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పరామర్శ



మంత్రి ఉత్తమ్‌ను పరామర్శిస్తున్న విద్యాసంస్థల నిర్వాహకులు

కోదాడ : రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఆదివారం మరణించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఆయనను, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని కోదాడకు చెందిన విద్యాసంస్థల నిర్వాహకులు పరామర్శించారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేజీటూపీజీ విద్యాసంస్థల మాజీ చైర్మన్ గింజల రమణారెడ్డి, ఎంఎస్ విద్యాసంస్థల నిర్వాహకుడు పందిరి నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు వెంపటి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం



నేరేడుచర్ల : వృద్ధుల ఆశీర్వాదం తీసుకుంటున్న చిన్నారులు

చిలుకూరు : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ వృద్ధులను గౌరవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునిత, టీచర్లు సిరికొండ కవిత, కస్తూరి జయలక్ష్మి, మాచర్ల సరస్వతి, కొండా లక్ష్మి, అలసకాని నిర్మల, జ్యోతి, చిన్నారులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

సోమారం గ్రామంలో..

నేరేడుచర్ల : మండలంలోని సోమారం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో వయోవృద్ధుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వృద్ధులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, కాళ్లకు నమస్కారం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వృద్ధులు తమ అనుభవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఐశ్వర్య, కళమ్మ, సంధ్య, ఆయాలు సంతోషి, రత్నల, గర్భిణులు, బాలింతలు తదితరులు ఉన్నారు.



చిలుకూరు : వయోవృద్ధులను సన్మానిస్తున్న సూపర్‌వైజర్, టీచర్లు

పౌరహక్కులను కాపాడడం అందరి బాధ్యత



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి

హుజూర్‌నగర్ : పౌరహక్కులను కాపాడడం అందరి బాధ్యత అని మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానమేనని అన్నారు. అనంతరం పౌరహక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాకుబ్ పాషా, ఎస్‌ఐ ముత్తయ్య, గెల్లి రవి, కౌన్సిలర్లు జక్కుల శంభయ్య, కొమ్ము శ్రీను, ఎ.సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, వార్డు అధికారులు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శోభనాద్రిగూడెంలో..

చింతలపాలెం మండలంలోని శోభనాద్రిగూడెంలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సైదిరెడ్డి, ఆర్‌ఐ వాసుదేవరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన ఉండాలి

పాలకవీడు : పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య అన్నారు. సోమవారం మండలంలోని కోమటికుంట గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వేచ్ఛ, సమానత్వాలతో ప్రజలు మసులుకోవాలన్నారు. అనంతరం ఎస్సీ కాలనీవాసులో ప్రభుత్వ పథకాలు, రోడ్లు, మంచినీటి వసతులపై రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, ఏఆర్‌ఐ సైదా, ఏఎన్‌ఎంల, ఆశా కార్యకర్త తదితరులు పాల్గన్నారు.

రేపాలలోని ఎస్సీ కాలనీలో..

మునగాల : మండలంలోని రేపాల గ్రామ పరిధిలో గల ఎస్సీ కాలనీలో సోమవారం మండల అధికారులు పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ మాట్లాడుతూ.. రెండు గ్లాసుల విధానంపై అవగాహన కల్పించారు. కుల వివక్ష, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, బాల్య వివాహాలపై వివరించారు. ఏఎస్‌ఐ కె.శ్రీనివాసరెడ్డి, మండల కార్పొరేషన్ ప్రత్యేక అధికారి నాగేందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి బ్రహ్మారెడ్డి, గ్రామ స్థాయి అధికారులు, ఎస్సీ కాలనీ యువత, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కొలువులకు పలువురి ఎంపిక


నవీన్


రవి


దేవిశెట్టి అరుణ


యర్రంశెట్టి శృతి


మిర్యాల అనూష


కొండా జ్యోతి

నడిగూడెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని కాగితరామచంద్రాపురంలో నిరుపేద కుటుంబానికి చెందిన బెల్లంకొండ నవీన్ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాడు. నవీన్ తండ్రి శ్రీను ఆరు నెలల వయస్సు ఉన్నప్పుడే అనారోగ్యంతో మృతి చెందగా తల్లి శారద కూలీ పనులు చేస్తూ కష్టపడి నవీన్‌ను చదివించింది. డిగ్రీ పూర్తి చేసి, డీఎల్ఎడ్ చదివాడు. డీఎస్సీ పరీక్షలో 76 మార్కులు సాధించి 50వ ర్యాంకుతో ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికయ్యాడు. అదేవిధంగా శ్రీరంగాపురంలో నిరుపేద కుటుంబానికి చెందిన కందిమళ్ల చంద్రయ్య, రమణల కుమారుడు రవి టీచర్ ఉద్యోగం సాధించాడు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ తమ కుమారుడు రవిని కష్టపడి చదివించారు. అతను అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో బీఈడీ, ఎంఈడీ పూర్తి చేశాడు. డీఎస్సీలో నూటికి 86.40 మార్కులు పొంది ఫస్ట్ ర్యాంకు సాధించి సోషల్ స్టడీస్‌లో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

సెకండరీ గ్రేడ్ టీచర్‌గా అరుణ

హుజూర్‌నగర్ : డీఎస్సీ ఫలితాల్లో హుజూర్‌నగర్‌లోని గోవిందపురంనకు చెందిన దేవిశెట్టి అరుణ 15వ ర్యాంక్ సాధించి సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఎంపికైంది. ఆమె 10వ తరగతి వరకు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ స్థానిక ప్రియదర్శిని కళాశాలలో చదివింది. డీఈడీ, బీఈడీని కోదాడ సనా కాలేజీలో పూర్తి చేసింది. ఆమె తండ్రి సుతారి మేస్త్రీ, తల్లి వ్యవసాయ కూలీ. ఆమెకు 2017 వి వాహం జరిగింది. భర్త కుటాల శ్రీనివాస్ ప్రోత్సాహంతో తను ఈ 15వ ర్యాంక్ సాధించినట్లు ఆమె తెలిపారు.

గురుకుల టీచర్‌గా విధులు నిర్వహిస్తూనే..

గరిడేపల్లి : డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని మర్రికుంట గ్రామానికి చెందిన యర్రంశెట్టి శృతి స్కూల్ అసిస్టెంట్ కొలువు సాధించింది. స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి మహిళా విభాగంలో మొదటి ర్యాంకు, ఎస్టీటీ విభాగంలో జిల్లా 12వ ర్యాంకు సాధించింది. రెండు నెలల క్రితం జరిగిన గురుకుల టీజీటీ సోషల్ విభాగంలో ఉద్యోగం సాధించి ప్రస్తుతం గురుకుల టీచర్‌గా విధులు నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా ఆమెను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

చిలుకూరు మండలంలో ఇద్దరికి..

చిలుకూరు : ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో చిలుకూరు మండలం నుంచి పలువురు జిల్లా ర్యాంకులు సాధించి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ (సోషల్) విభాగంలో చిలుకూరుకు చెందిన మిర్యాల అనూష జిల్లా 4వ ర్యాంక్ సాధించింది. చిలుకూరుకు చెందిన కొండా విజయలక్ష్మి స్కూల్ అసిస్టెంట్ (సోషల్)లో విభాగంలో ఖమ్మం జిల్లాలో 10వ ర్యాంక్ సాధించింది. వీరితో పాటు గ్రామానికి చెందిన మాదాసు పుష్పారాణి జిల్లాలో 31వ ర్యాంక్ సాధించింది. బేతవోలుకు చెందిన గుండు రమేష్ ఎస్‌జీటీ విభాగంలో 25 ర్యాంక్ సాధించాడు.

'అరబిందో' పూర్వ విద్యార్థికి ఉద్యోగం

నేరేడుచర్ల : డీఎస్సీ ఫలితాల్లో నేరేడుచర్లలోని న్యూ అరబిందో డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థిని కొండా జ్యోతి స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) విభాగంలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు కరస్పాండెంట్ కట్టా ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన కొండా జ్యోతి ప్రస్తుతం సర్వేల్ గురుకుల పాఠశాలలో టీజీటీగా పని చేస్తున్నట్లు తెలిపారు. గ్రూప్– 4 ఉద్యోగానికి కూడా ఎంపికైనట్లు పేర్కొన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన జ్యోతి టీచర్ ఉద్యోగం సాధించడం పట్ల కళాశాల కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు సతీష్, శ్రీధర్, ప్రభాకర్, లింగారెడ్డి, శ్రీనివాసచారి, ఆంజనేయులు, నాగప్రసాద్, బాలకృష్ణ అభినందించారు.

విద్యార్థికి అభినందన



నడిగూడెం : వంశీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయనాయక్

నడిగూడెం : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యాపేటలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి చిత్ర లేఖనం పోటీల్లో నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి వంశీ ప్రథమ బహుమతి పొందాడు. దీంతో కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వంశీని ప్రిన్సిపాల్ విజయనాయక్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో బహుమతి సాధించిన విద్యార్థికి..

హుజూర్‌నగర్ : పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీల్లో పట్టణానికి చెందిన లక్కాకుల శ్రావణి, హరిప్రసాద్‌ల కుమారుడు మోక్షర్యా అండర్– 7 విభాగంలో ద్వితీయ బహుమతి సాధించాడు. దీంతో సోమవారం అతనిని స్థానికులు అభినందించారు.

హామీలు అమలు చేయాలి

గరిడేపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి యాకుబ్ అన్నారు. సోమవారం మండలంలోని కాల్వపల్లిలో నిర్వహించిన సీపీఎం గ్రామ సభలో ఆయన మాట్లాడారు. మహిళా కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, అదుపు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పటాన్ మహబూబ్ అలీ, గండు సురేష్, సామేలు, ఈదుల ఉపేందర్, సైదులు, రాములమ్మ, రామరాజు, సముద్రం పాల్గొన్నారు.

విశ్వనాథం మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

కోదాడరూరల్ : మండలంలోనిగుడిబండకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాలేబోయిన విశ్వనాథం(58) అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం ఆయన మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. విశ్వనాథం మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. నివాళులర్పించిన వారిలో సీనియర్ నాయకులు ఇర్ల నర్సింహారెడ్డి, ఎరగాని లక్ష్మయ్య, కుక్కడపు సైదులు, ఎరగాని రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

పట్టణ పరిశుభ్రతే ప్రధాన లక్ష్యం



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్ పర్సన్, సిబ్బంది

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మాస్ స్కేల్ క్లీనెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ మాట్లాడుతూ.. పట్టణ పరిశుభ్రతే ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ అలక సరిత, కౌన్సిలర్ తాళ్లూరి సాయిరాం, కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

పాలకవీడు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ నర్సయ్య కోరారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పరిశుభ్రతపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిల్వ నీరు ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ అసిస్టెంట్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతితో మమేకమైన పండుగ బతుకమ్మ



బతుకమ్మ సంబరాల్లో అధ్యాపకులు, విద్యార్థులు

హుజూర్‌నగర్ : ప్రకృతితో మమేకమైన పండుగ బతుకమ్మ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు వివిధ వర్ణాల పుష్పాలతో బతుకమ్మలను అందంగా పేర్చి కళాశాలకు తీసుకొచ్చారు. బతుకమ్మలను కళాశాల ఆవరణలో ఉంచి సంప్రదాయం ఉట్టి పడేలా పాటలతో బతుకమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మలను సమీపంలోని నీటిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రియాంక, సునంద, డాక్టర్ నగేష్, బాలరాజు, నాగార్జున, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, నిఖిల్ వర్మ, శ్రీనివాస్, స్వాతి, శ్రీకాంత్, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

583 మందికి రూ.3 కోట్లు రుణమాఫీ

మఠంపల్లి : మఠంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 583 మంది రైతులకు రూ.3 కోట్ల రుణమాఫీ వర్తించినట్లు పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య తెలిపారు. సోమవారం పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఏసీఎస్ పరిధిలో మొత్తం 889 మంది రైతుల రుణమాఫీకి సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఇంకా 306 మంది రైతులకు రూ.2 కోట్ల 20 లక్షలు రుణమాఫీ కావాల్సి ఉందని అన్నారు. డీసీసీబీ డైరెక్టర్ కొమ్ము కరుణాసైదులు, వైస్ చైర్మన్ బాబునాయక్, సీఈఓ తిరుపతయ్య, సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

గోవిందమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలి



గోవిందమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెంలో అనారోగ్యంతో సోమవారం మృతి చెందిన మధ్యాహ్న భోజన కార్మికురాలు గోవిందమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. సోమవారం గ్రామంలో గోవిందమ్మ మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా, మధ్యాహ్న భోజన ఏజెన్సీ సంఘం మండల అధ్యక్షురాలు శాంతకుమారి, నాయకులు లచ్చిరాం, లాలాసాబ్, సోమ్లానాయక్, కిషన్‌నాయక్, రాజ్యలక్ష్మి, మంగమ్మ, కుమారి, సువార్త పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మఠంపల్లి : మండల కేంద్రంలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మఠంపల్లి మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ హరీష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

మోతె : మండలంలోని మామిళ్లగూడెం గ్రామంలో గల శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయురాలు ఫాతిమా సందానిని సోమవారం యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మీరాబీ, కరస్పాండెంట్ జానిమియా, అకాడమిక్ డీన్ అబ్దుల్ అజారుద్దీన్, ప్రిన్సిపాల్ సఫియా, డైరెక్టర్ సయ్యద్‌మియా, అబుందల్ అజాద్, ఇన్‌చార్జ్ చాంద్‌పాష, నర్సయ్య, వేముల రమేష్, మల్లేష్, సునిల్, లక్ష్మయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పైప్ లైన్ పనుల సర్వేను నిలిపివేయాలి

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలోని పాత వెళ్లటూరు ఎత్తిపోతల పథకం నుంచి మేళ్లచెరువు మండలంలోని రైతుల పొలాల గుండా ముక్యాల మేజర్ వరకు నీటిని అందించేందుకు చేపట్టిన పైపులైన్ పనుల సర్వే పనులను సోమవారం మేళ్లచెరువు పరిధిలో రైతులు అడ్డుకొని ఆందోళన చేశారు. రైతులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తమ పొలాలలో చేస్తున్న సర్వేను నిలిపివేయాలని రైతులు కోరారు. గత ప్రభుత్వ హయాంలో సర్వే చేపట్టగా రైతుల ఆందోళనతో ఆపివేశారని, తిరిగి మళ్లీ ప్రైవేటు వ్యక్తులు సర్వే చేస్తున్నారని రైతులు తెలిపారు.

అత్యవసరంలో రక్తదానం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తికి ఏ పాజిటీవ్ రక్తం అత్యవసరం కావడంతో స్థానిక జనచైతన్య ట్రస్ట్ సభ్యులు రక్తదానం చేశారు. దీంతో ట్రస్ట్ సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శివశంకర్, సాయి, రమేష్, కాశీవిశ్వనాథ్, జయంత్, చంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

కోదాడరూరల్ : ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రౌతు కల్యాణ్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇవ్వాలని, రాష్ట్రంలో పలు శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో రాబోయే రోజుల్లో నిరుద్యోగ యువత, విద్యార్థులు తగిన గుణపాఠం చెప్తారని ఆయన పేర్కొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

తుంగతుర్తి : దళితబంధు నిధులు విడుదల చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి లబ్ధిదారులు వినతిపత్రం అందజేశారు. గుడిపాటి వీరయ్య, మల్లేపాక రాములు, పాల్వాయి వెంకన్న, వెంకన్న ఉన్నారు.